

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, వనపర్తి

జోగులాంబ గద్వాల

నారాయణపేట



బుధవారం 04 నవంబర్ 2026 పేజీలు:11

నర్వలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,461,

బీ గ్రేడ్‌కు రూ.2,441 మద్దతు ధర

నర్వ, నవంబర్ 03 ప్రజా జ్యోతి

నారాయణపేట జిల్లా నర్వ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నర్వలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

మిగతా 2 లో

గత పాలకుల నిర్లక్ష్యమే

సాగునీటి సంక్షోభానికి కారణం!

- ప్రాజెక్టులు పెండింగ్ పెట్టి.. ఇప్పుడు రైతులపై ప్రేమా?
- ప్రాజెక్టులు పూర్తి చేయలేక.. ఇప్పుడు నీళ్ల పంచాయితీనా?
- హరీశ్‌రావు వ్యాఖ్యలకు జూపల్లి, మేఘారెడ్డి కౌంటర్.. తొమ్మిదేళ్ల పాలనపై ప్రశ్నల వర్షం
- పాలమూరు రైతాంగానికి అన్యాయం చేసింది గత ప్రభుత్వమే!
- నిరంజన్‌రెడ్డిపై మేఘారెడ్డి ఘాటు వ్యాఖ్యలు



వనపర్తి, నవంబరు 3 (ప్రజాజ్యోతి):

పాలమూరు సాగునీటి ప్రాజెక్టుల అంశం అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ వేడిని రాజేస్తోంది. పెద్దమందడి మండలం అల్వాలలో మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన విమర్శలకు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దీటుగా స్పందించారు. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయలేకపోయిన నేతలు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ఏమిటని నిలదీశారు.

మిగతా 2 లో



నిర్మాణ పనులు వేగవంతం చేయాలి..

నిర్లక్ష్యం వహిస్తే మంజూరులు రద్దు!

అధికారుల తీరుపై కలెక్టర్ ఖుష్బూ గుప్తా అసంతృప్తి..

వారానికి ఒకరోజు క్షేత్రస్థాయి పర్యటన తప్పనిసరి

మహబూబ్‌నగర్, నవంబర్ 3 (ప్రజా జ్యోతి బ్యూరో):

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ నిర్మాణ పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగకపోవడంపై జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అసంతృప్తి వ్యక్తం చేశారు. వి.బి.జి. రామ్ జీ పథకం కింద చేపట్టిన విలేజ్ ఆర్గనైజేషన్ (వి.ఓ.) భవనాలు, గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆహార ధాన్యాల నిల్వ గిడ్డంగులు, మరుగుదొడ్ల నిర్మాణాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనులు ప్రారంభించడంలో నిర్లక్ష్యం వహిస్తే మంజూరులను రద్దు చేసి, నిర్మాణాలకు ఆసక్తి చూపే ఇతర గ్రామాలకు కేటాయిస్తామని హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మండలాల వారీగా నిర్మాణ పనుల పురోగతిని కలెక్టర్ పరిశీలించారు.

మిగతా 2 లో



గత పాలకుల నిర్లక్ష్యమే సాగునీటి సంక్షోభానికి కారణం!

మొదటిపేజీ తరువాయి

మంగళవారం వనపర్తిలోని డీసీసీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో గత ప్రభుత్వ హయాంలో సాగునీటి రంగానికి జరిగిన నష్టాన్ని ప్రస్తావిస్తూ విమర్శలు గుప్పించారు.

రూ.25 వేల కోట్లతో 90 శాతం పనులా? : మంత్రి జూపల్లి కృష్ణారావు

పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని ప్రకటించిన గత ప్రభుత్వం తొమ్మిదేళ్లలో ఎందుకు పూర్తి చేయలేకపోయిందని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రశ్నించారు. సుమారు రూ.60 వేల కోట్లతో పూర్తికావాల్సిన ప్రాజెక్టుకు రూ.25 వేల కోట్లు ఖర్చు చేసి 90 శాతం పనులు పూర్తయ్యాయని ఎలా చెబుతారని నిలదీశారు. ప్రస్తుత అంచనాల ప్రకారం ప్రాజెక్టు పూర్తి చేయడానికి మరో రూ.80 వేల కోట్లు అవసరమవుతాయని పేర్కొన్నారు. జూరాల ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 10 టీఎంసీలేనని, అక్కడి నుంచి రామన్‌పాడుకు సమాంతర కాలువ నిర్మాణంలో ఉన్న సాంకేతిక లోపాలను గతంలోనే సూచించినా పట్టించుకోలేదన్నారు. గూడెం దొడ్డి రిజర్వాయర్‌ను 15 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించి ఉంటే వేలాది ఎకరాలకు సాగునీరు అందేదని, మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం ద్వారా 4.60 లక్షల ఎకరాలకు నీరందించే అవకాశం ఉండేదని తెలిపారు. కల్వకుర్తి ప్రాజెక్టులో మోటార్లను గతంలోనే ఎందుకు పూర్తిస్థాయిలో వినియోగించలేదని ప్రశ్నించారు.

నీటి తరలింపుపై ఎదురుదాడి

ఆంధ్రప్రదేశ్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం నీటిని తరలిస్తోందన్న హరీశ్‌రావు ఆరోపణలను జూపల్లి ఖండించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే నీటి వినియోగంపై ప్రశ్నలు తలెత్తాయని విమర్శించారు. 2014--15లో 375 టీఎంసీల నీటిని వినియోగించుకున్నారని, ఉమ్మడి రాష్ట్రంలో కేసీఆర్, హరీశ్‌రావుల నిర్ణయాలతో 511 టీఎంసీల నీటిని ఆంధ్రప్రదేశ్‌కు అప్పగించారని ఆరోపించారు. ప్రస్తుతం రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నార్లాపూర్ నుంచి నీటిని విడుదల చేశామని, కల్వకుర్తి ప్రాజెక్టు ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని వివరించారు. కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు.

నిరంజన్‌రెడ్డికి బీఫామ్ కూడా రాదు: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

తొమ్మిదేళ్ల పాలనలో ఏం సాధించారో చెప్పకుండా ఇప్పుడు రైతుల గురించి మాట్లాడటం విడ్డూరమని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో బీఫామ్ కూడా రాదంటూ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పాలనలో ఎన్ని ప్రాజెక్టులు నిర్మించారు? కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని ప్రాజెక్టులు పూర్తి చేసిందన్నది ఆ పార్టీ నేతలు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. కరువు పరిస్థితులపై కేబినెట్ సమీక్షలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని, రైతులకు ఉపశమనం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

'నీళ్ల నిరంజన్ కాదు.. నీళ్ల దొంగ నిరంజన్'

మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని మేఘారెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'నీళ్ల నిరంజన్ కాదు.. నీళ్ల దొంగ నిరంజన్' అంటూ ఆరోపణలు గుప్పించారు. ఆయన ఫామ్‌హౌస్‌లలో అక్రమంగా బోర్లు వేయించి, రైతులకు అందాల్సిన సాగునీటిని తన ఫామ్‌హౌస్‌ల వైపు మళ్లించుకున్నారని ఆరోపించారు. ఈ ఆరోపణలను నిరంజన్‌రెడ్డి ఖండించారా లేదా అన్న వివరాలు ఈ సమావేశంలో ప్రస్తావనకు రాలేదు. గతంలో వరి సాగుపై హెచ్చరికలు చేసిన నేతలు ఇప్పుడు రైతుల సంక్షేమం గురించి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. నిరుద్యోగుల సమస్యలపైనా గత పాలకులు సరైన విధంగా స్పందించలేదని విమర్శించారు. అల్వాలలో హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలకు జూపల్లి, మేఘారెడ్డి ఇచ్చిన సమాధానాలతో పాలమూరు సాగునీటి ప్రాజెక్టుల అంశం మరోసారి రాజకీయ చర్చకు కేంద్రంగా మారింది. పెండింగ్ ప్రాజెక్టులు, నీటి కేటాయింపులు, కరువు పరిస్థితులపై అధికార, ప్రతిపక్షాల మధ్య విమర్శలు కొనసాగుతున్నాయి. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి రమేష్, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, పట్టణ అధ్యక్షుడు కదిరే రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పెబ్బేరు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ సుమిత్ర ఎల్లారెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు తైలం శంకర్ ప్రసాద్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ శంకర్ నాయక్, పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్మాణ పనులు వేగవంతం చేయాలి.. నిర్లక్ష్యం వహిస్తే మంజూరులు రద్దు!

మొదటిపేజీ తరువాయి

పనుల ప్రస్తుత స్థితి, నిధుల వినియోగం, పెండింగ్ బిల్లులు, నిర్మాణాల జాప్యానికి గల కారణాలపై ఇంజినీరింగ్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

నిధుల కొరత లేదు.. మరి పనుల్లో జాప్యమెందుకు?

వి.బి.జి. రామ్ జీ పథకం కింద చేపట్టిన పనులకు నిధుల కొరత లేదని, ప్రభుత్వం నుంచి అందిన అడ్వాన్స్ నిధులను సద్వినియోగం చేసుకొని నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ కొన్ని మండలాల్లో పనులు మందకొడిగా సాగుతుండటంపై అధికారులను ప్రశ్నించారు. ఒకవైపు కొన్ని మండలాల్లో అధికారులు నిరంతరం బిల్లులు సమర్పిస్తూ పనులను ముందుకు తీసుకెళ్తుంటే, మరికొన్ని మండలాల్లో ఎందుకు వెనుకబడి ఉన్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు.

బిల్లుల పేరుతో జాప్యం చేస్తే సహించేది లేదు

గతంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను కూడా త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. పనులు పూర్తయిన వెంటనే కొలతల పుస్తకాల్లో (ఎం.బి.) నమోదు చేసి బిల్లులను సంబంధిత అధికారులకు పంపించాలని సూచించారు. ఏఈలు, డీఈలు తమ కార్యాలయాల్లో బిల్లులను పెండింగ్‌లో ఉంచకుండా పరిశీలన, ధ్రువీకరణ, ఎఫ్‌టీఓల జనరేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

పునాదులకే పరిమితమైతే ఎలా?

గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలపై ప్రత్యేకంగా సమీక్షించిన కలెక్టర్.. కొన్ని చోట్ల పనులు ఇంకా ప్రారంభం కాకపోవడం, మరికొన్ని చోట్ల పునాది స్థాయిలోనే నిలిచిపోవడంపై ఆరా తీశారు. ఇప్పటికే పునాది, గోడలు, స్లాబ్ స్థాయికి చేరుకున్న పనులను తదుపరి దశలకు తీసుకెళ్లాలని ఆదేశించారు. పాత పనులు పూర్తి చేయకుండా కొత్త పనుల కోసం ప్రతిపాదనలు పంపడం సరికాదని, ముందుగా మంజూరైన నిర్మాణాలను పూర్తి చేయడంపై దృష్టి సారించాలని సూచించారు. వి.ఓ. భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ధాన్యం నిల్వ గిడ్డంగుల నిర్మాణాలకు స్థల సమస్యలు లేదా స్థానిక అభ్యంతరాలు ఎదురైతే ఎంపీడీఓలు, తహసీల్దార్లు, సర్పంచులతో సమన్వయం చేసుకొని పరిష్కరించాలని ఆదేశించారు. అనుకూలమైన స్థలాలు



ఉన్నప్పటికీ పనులు ప్రారంభించకపోవడాన్ని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

వారానికి ఒకరోజు క్షేత్రస్థాయి పర్యటన తప్పనిసరి

నిర్మాణ పనుల పర్యవేక్షణ కేవలం కార్యాలయాలకే పరిమితం కాకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి అధికారి వారానికి కనీసం ఒకరోజు నిర్మాణ ప్రదేశాలను సందర్శించి పనుల నాణ్యత, పురోగతి, కార్మికుల హాజరు, ఎదురవుతున్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించాలని ఆదేశించారు. ఎంపీడీఓలు నిర్వహించే సమీక్షా సమావేశాల్లోనూ నిర్మాణ పనుల పురోగతిని తప్పనిసరిగా సమీక్షించాలని సూచించారు.నిర్మాణ పనుల్లో జాప్యానికి గల కారణాలను గుర్తించి అక్కడికక్కడే పరిష్కార చర్యలు చేపట్టాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ నరసింహులు, పంచాయతీరాజ్ ఈఈ, డీఈలు, ఏఈలు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నర్వలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

మొదటిపేజీ తరువాయి

రైతులకు మద్దతు ధర అందించడంతోపాటు ధాన్యం విక్రయాల్లో సౌకర్యం కల్పించేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2,461, బీ గ్రేడ్ ధాన్యానికి రూ.2,441 మద్దతు ధర చెల్లించనున్నట్లు తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మానిటరింగ్ అధికారి కవిత, సంఘం పాలకవర్గ సభ్యులు ఎం. రామేశ్వర్ రెడ్డి, ఎస్. వెంకటేశ్వర్ రెడ్డి, పల్లె శేఖర్, నడిపి బుచ్చన్న, సీఈఓ ఉదయ్ కుమార్, రైతులు వెంకటన్న, రాజశేఖర్ రెడ్డి, సునీల్, నర్సింహులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
బుధవారం 04 నవంబర్ 2026


ఎల్‌నినో ప్రభావంపై ప్రజలకు అవగాహన కల్పించిన టీఎస్ఎస్ కళాబృందం

- మద్దెలబండ,పెద్దతండాలో నీటి సంరక్షణ,

విద్యుత్ పొదుపు,పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం

మల్దకల్ నవంబర్ 03(ప్రజా జ్యోతి ప్రతినిధి):

జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలోని మద్దెలబండ పెద్దతండా గ్రామంలో ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు,నీటి సంరక్షణ,పర్యావరణ పరిరక్షణపై టీఎస్ఎస్ కళాబృందం ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఐఏఎస్ సూచనలు,సలహాల మేరకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆదేశాల ప్రకారం జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా టీఎస్ఎస్ కళాబృందం కళాకారులు తమ ఆటపాటలు,మాటల ద్వారా ప్రజలకు పలు సూచనలు చేశారు.భూగర్భ జలాలను కాపాడుకోవాలని,నీటిని పొదుపుగా వినియోగించాలని,ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు.విద్యుత్‌ను వృథా చేయకుండా ఆదా చేయాలని,ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద లేదా గ్రామ పరిసర ప్రాంతాల్లో కనీసం పది మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.అలాగే పశువులు,గొర్రెలు, బర్రెలు,ఎద్దులు,పక్షులు తదితర మూగజీవాల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.వేసవిలో నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో,గ్రామ పరిసర ప్రాంతాల్లో,రైతుల పొలాల వద్ద మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్లు,నీటి కుండీలు ఏర్పాటు చేయాలని సూచించారు. పశువులకు అవసరమైన పశుగ్రాసం అందుబాటులో ఉండేలా గ్రామ సర్పంచ్,గ్రామ పెద్దలు,రైతులు ప్రత్యేక చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.మండల రెవెన్యూ అధికారి ఆధ్వర్యంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి, విద్యుత్ శాఖ అధికారులు,పశు వైద్యాధికారులు,వైద్యాధికారుల సమన్వయంతో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో



గ్రామ సర్పంచ్ నాన్య నాయక్,ఉపసర్పంచ్,వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు,ప్రజలు,రైతులు, యువత,ఉపాధి కూలీలు,బంజారా మహిళలు,వృద్ధులు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.టీఎస్ఎస్ కళాబృందం కళాకారులు మహమ్మద్ హజరత్,రాహుల్,కేశవులు తమ కళాప్రదర్శనల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.

శాంతినగర్ లో జాతీయ పురస్కార గ్రహీతకు సన్మానం

వడ్డేపల్లి,నవంబర్ 3 (ప్రజా జ్యోతి):

దళిత జర్నలిస్ట్ ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కాషపోగు జాన్ జాతీయ పురస్కారం అందుకోవడం పట్ల వడ్డేపల్లి జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు.నెల్లూరు జిల్లాకు చెందిన ఎం.వి.రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రకటించిన జాతీయ పురస్కారానికి జాన్ ఎంపికయ్యారు.ఈ పురస్కారంతో పాటు మెమెంటోను ఆయన అందుకున్నారు.ఈ నేపథ్యంలో శాంతినగర్ లో మంగళవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో జర్నలిస్టులు శాలువా,పూలమాలతో ఘనంగా సత్కరించి,మిఠాయిలు తినిపించి శు భాకాంక్షలు తెలిపారు.దళిత జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం గళం విప్పుతూ,వారి హక్కుల సాధన కోసం కృషి చేస్తున్న జాన్ కు ఈ జాతీయ గుర్తింపు దక్కడం గర్వకారణమని జర్నలిస్టులు కొనియాడారు.ఈ కార్యక్రమంలో కోయిల్దిన్నె శేఖర్, జర్నలిస్టులు శాంతిరాజు, బుచ్చన్న, మధు, వెంకటేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



22వ రోజుకు చేరిన ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సమ్మె

– పోచమ్మ బోనాలతో అమ్మవారికి వినతిపత్రం.. డిమాండ్లు పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి

వనపర్తి, నవంబరు 3 (ప్రజాజ్యోతి):

జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మె వనపర్తి జిల్లాలో 22వ రోజుకు చేరింది. మంగళవారం కలెక్టరేట్ పరిధిలో ఎన్‌హెచ్ఎం జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు పోచమ్మ బోనాలతో నిరసన తెలిపారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పోచమ్మ తల్లికి సమర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా అధ్యక్షుడు పరుశురాం మాట్లాడుతూ.. గత 20 ఏళ్లకు పైగా 78 కేడర్లలో విధులు నిర్వహిస్తున్న ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు ప్రజలకు నిరంతరం వైద్యసేవలు అందిస్తున్నారని తెలిపారు. కరోనా, డెంగీ వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించారని పేర్కొన్నారు. బస్తీ దవాఖానాలు, పల్లె దవాఖానాలు, తెలంగాణ డయాగ్నోస్టిక్స్, హైరిస్క్ ప్రసవాల నిర్వహణ తదితర ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల అమలులో ఉద్యోగుల పాత్ర కీలకమన్నారు. జేఏసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ క్లీవెన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైద్యసేవల అభివృద్ధికి ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల కృషి ఎంతో ఉందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల శాతాన్ని 31 నుంచి 70 శాతానికి పెంచడంలో, మాతృ మరణాల రేటును 25 నుంచి 19కు, శిశు మరణాల రేటును 15 నుంచి 5కు తగ్గించడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. 2.98 కోట్ల మందికి కంటి పరీక్షలు నిర్వహించడం, టీబీ నిర్మూలనలో రాష్ట్రాన్ని జాతీయ స్థాయిలో మూడో స్థానానికి చేర్చడం వంటి విజయాల్లోనూ ఉద్యోగుల సేవలు ఉన్నాయని వివరించారు. డాక్టర్ హరీశ్ మాట్లాడుతూ.. అప్పుడే పుట్టిన శిశువుల నుంచి 18 ఏళ్లలోపు పిల్లల వరకు గుండె సంబంధిత



సమస్యలు, ప్లాస్టిక్ సర్జరీలు, గ్రహణమొర్రి, వంకరపాదం తదితర సమస్యలకు శస్త్రచికిత్సలు చేయించడంలో ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సేవలు కీలకమని పేర్కొన్నారు.ఎన్‌హెచ్ఎం ప్రధాన డిమాండ్లు ఇవే..ఎన్‌హెచ్ఎం పరిధిలోని అన్ని కేడర్ల ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, క్యాడర్ ఫిక్సేషన్ చేపట్టి 100 శాతం గ్రాస్ శాలరీ అమలు చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. జీఓ నంబర్ 60ను తక్షణమే అమలు చేయడంతోపాటు ఏటా 5 శాతం ఇంక్రిమెంట్లు కల్పించాలని కోరారు. 8 శాతం లాయల్టీ బోనస్ అమలు చేసి పెండింగ్ బకాయిలు చెల్లించాలని, జీఓ నంబర్ 1195ను పునఃపరిశీలించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ హరీశ్, కమిటీ సలహాదారు వెంకటకృష్ణారెడ్డి, కోశాధికారి రాఘవేంద్ర, డాక్టర్ మైథిలి, జాయింట్ సెక్రటరీ అనసూయ, మహిళా ఉద్యోగుల వైస్ ప్రెసిడెంట్ సుమిత్ర, రాధిక, జయమ్మ, స్టాఫ్ నర్సులు చరిత, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
బుధవారం 04 నవంబర్ 2026

విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలి

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

- మెనూ ప్రకారం భోజనం అందించని ఏజెన్సీని తొలగించాలని ఆదేశం..

- వైద్య ఉపకేంద్రం సిబ్బందికి షోకాజ్ నోటీసులు

గద్వాల నవంబర్ 03(ప్రజా జ్యోతి ప్రతినిధి):

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తూ,నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ఉత్తమ ఫలితాలు సాధించి,ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు.మంగళవారం మానవపాడు మండలం జల్లాపురం గ్రామంలో జిల్లా కలెక్టర్ పర్యటించారు.ముందుగా గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరుకావాలని,తరచూ సెలవులు పెట్టకుండా తల్లిదండ్రులు పర్యవేక్షించేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు.తల్లిదండ్రులతో తరచూ సమావేశాలు నిర్వహించి పిల్లలు ఇంటి వద్ద కూడా చదువుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు.పదో తరగతి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో సాధించిన మార్కుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.వెనుకబడిన సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించి,ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఫలితాలు సాధించ వచ్చన్నారు. పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతోపాటు ప్రతి విద్యార్థి 550కు పైగా మార్కులు సాధించేలా కృషి చేయాలని ఆకాంక్షించారు.ఇప్పటికే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నందున విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్ ఫీడ్‌బ్యాక్ రికార్డును తనిఖీ చేశారు.భోజనం నాణ్యతపై పలువురు విద్యార్థులు సంతృప్తికరంగా లేదని అభిప్రాయం వ్యక్తం చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పర్యవేక్షణకు మెస్ కమిటీ ఏర్పాటు చేయాలని,ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం అందించని ప్రస్తుత ఏజెన్సీని తొలగించి కొత్త ఏజెన్సీని నియమించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విష్ణువర్ధన్‌ను ఆదేశించారు.

గ్రామంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

జల్లాపురం గ్రామంలోని పలు ప్రాంతాల్లో చెత్తాచెదారం పేరుకు



పోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.గ్రామంలో పారిశుద్ధ్య పనులను వేగవంతం చేసి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శి శ్రీధర్‌రెడ్డిని ఆదేశించారు.దోమలు,ఇతర కీటకాల ద్వారా వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం గ్రామంలోని వైద్య ఉపకేంద్రాన్ని సందర్శించగా తాళం వేసి ఉండటంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.విధుల్లో నిర్లక్ష్యం వహించిన వైద్య ఉపకేంద్ర సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సంధ్య కిరణ్మయికి ఫోన్ ద్వారా ఆదేశించారు.

ఆన్‌లైన్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

అనంతరం మానవపాడు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు.వివిధ కోర్సులు అభ్యసిస్తున్న ఇంటర్మీడియట్ విద్యార్థులతో మాట్లాడారు.ఇంజనీరింగ్,వైద్య విద్య వంటి ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఇప్పటి నుంచే నిర్దిష్ట లక్ష్యాలను ఏర్పరచుకొని ప్రణాళికాబద్ధంగా చదవాలని సూచించారు.పాఠ్యాంశాలపై ఎలాంటి సందేహాలు ఉన్నా వెంటనే అధ్యాపకులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు.ప్రతి విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ విద్య ఎంతో కీలకమని,భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవడానికి ఈ దశలో చదువుపై ప్రత్యేక శ్రద్ధ



పెట్టాలని తెలిపారు.విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై తరచూ కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహించాలని అధ్యాపకులను ఆదేశించారు. చరవాణులను అనవసరంగా వినియోగిస్తూ విలువైన సమయాన్ని వృథా చేయకుండా ఆన్‌లైన్ డిజిటల్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా వంటి ఆన్‌లైన్ విద్యా వేదికల ద్వారా కూడా పాఠ్యాంశాలను నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు.పదో తరగతి కంటే ఇంటర్మీడియట్‌లో మరింత మెరుగైన మార్కులు సాధించాలని,ఇంటర్ ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలోనే ముందంజలో నిలిచేలా విద్యార్థులు,అధ్యాపకులు కృషి చేయాలన్నారు.ఆంగ్ల భాషపై పట్టు సాధించడంతోపాటు కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తెలిపారు.ప్రతి విద్యార్థికి కంప్యూటర్ పరిజ్ఞానం అవసరమని,వ్యాసరచన,ఉపన్యాస పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటాలని, క్రీడల్లోనూ రాణించాలని సూచించారు.విద్యార్థులకు ఏకరూప దుస్తులను సకాలంలో అందించాలని,కళాశాలలో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు.ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సుమారు మూడు నెలల సమయం మాత్రమే ఉన్నందున విద్యార్థులందరూ కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పర్యటనలో గ్రామ సర్పంచ్ నందిని,ఇంటర్ నోడల్ అధికారి హృదయ రాజ్,తహసీల్దార్ మన్సూర్ అలీ సిద్దికి,ఎంపీడీవో రాఘవ,కళాశాల ప్రిన్సిపాల్ మంజుల,ఇతర అధికారులు పాల్గొన్నారు.

?30,000 డిమాండ్.. ?15,000 వసూలు!

- ఆర్టీఐ పేరుతో క్యాంటీన్ నిర్వాహకులకు బెదిరింపులు.. ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు

మహబూబ్‌నగర్, నవంబర్ 3 (ప్రజా జ్యోతి బ్యూరో):

జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ నిర్వాహకులను ఆర్టీఐ పేరుతో బెదిరించి డబ్బులు వసూలు చేసిన ఘటనపై మహబూబ్‌నగర్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.
పోలీసుల వివరాల ప్రకారం.. అక్టోబర్ 30న ఇద్దరు వ్యక్తులు క్యాంటీన్‌కు వెళ్లి చాయ్ తాగిన అనంతరం క్యాంటీన్ నిర్వాహకులు రాధ, మైబమ్మలను ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేయలేదని, కిచెన్ పరిశుభ్రంగా లేదని ఆరోపిస్తూ బెదిరించినట్లు సమాచారం. ఈ విషయాన్ని ఆర్టీఐ ద్వారా పై అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించి రూ.30 వేల నగదు డిమాండ్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో భయాందోళనకు గురైన క్యాంటీన్ నిర్వాహకులు రూ.15 వేలు వారికి అందజేసినట్లు తెలిపారు. అనంతరం బాధితులు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆర్టీఐ చట్టం పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్నారా? అనే అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.

బాలికల భద్రతపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

- గుడ్ టచ్,బ్యాడ్ టచ్,బాల్యవివాహాలు,మానవ అక్రమ రవాణాపై విద్యార్థులకు అవగాహన

- మల్దకల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం







మల్దకల్ నవంబర్ 03(ప్రజా జ్యోతి ప్రతినిధి):

మల్దకల్ మండలంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికా, శిశు సాధికారత మరియు భద్రత క్లబ్ ఏర్పాటులో భాగంగా బాలికల భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు మణెమ్మ,గీత ఆధ్వర్యంలో ఎస్సై శ్రీహరి సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన మహిళా కానిస్టేబుల్ మౌనిక బాలికల భద్రతకు సంబంధించిన పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.గుడ్ టచ్,బ్యాడ్ టచ్, మహిళల అక్రమ రవాణా,బాల కార్మిక వ్యవస్థ,బాల్యవివాహాలు తదితర అంశాలను వివరంగా తెలియజేశారు.సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న వివిధ సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు.విద్య అనేది ప్రతి సమస్యను అధిగమించేందుకు ఉపయోగపడే శక్తివంతమైన ఆయుధమని పేర్కొన్నారు.విద్యార్థినులు చదువును నిర్లక్ష్యం చేయకుండా ఇష్టంతో,కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని,భవిష్యత్తులో పదిమందికి సహాయపడే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేష్ మాట్లాడుతూ, బాలికలు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ప్రభుత్వం అన్ని అవకాశాలు కల్పిస్తోందని,వాటిని సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు ఇస్మాయిల్,తిప్పారెడ్డి,సుధాకర్, ఉపాధ్యాయులు రాజేశ్వర్ రెడ్డి,సుజాత,భాస్కర్,శుభ,వరలక్ష్మి,రమణమ్మ, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

- నవంబర్ 6లోగా దరఖాస్తు చేసుకోవాలి..

సర్పంచ్ కేతపాగ జయమ్మ,లక్ష్మయ్య పిలుపు

చిన్నంబావి, నవంబర్ 03 (ప్రజాజ్యోతి)

రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి పట్టభద్రుడు తమ ఓటు హక్కును నమోదు చేసుకో వాలని చిన్నంబావి మండలం పెద్దమారూర్ గ్రామ సర్పంచ్ కేతపాగ.జయమ్మ,లక్ష్మయ్య కోరారు. ప్రజాస్వామ్య వ్య వస్థలో ఓటు హక్కు ఎంతో కీలకమని, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అభిప్రాయాన్ని తెలియజేసేందుకు అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆమె చిన్నంబావి మండల పట్టుభద్రులకు సూచించారు. 2023 అక్టోబర్ 31వ తేదీ నాటికి డిగ్రీ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన తత్సమాన విద్యార్హత పూర్తి చేసిన వారు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు అర్హులని తెలిపారు. రంగారెడ్డి-హైదరాబాద్-మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నంబావి మండల కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే జిల్లాలోని అర్హులైన పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా ఎన్నికల సంఘం నిర్దేశించిన ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, డిగ్రీ సర్టిఫికెట్, ప్రొవిజనల్ సర్టిఫికెట్ లేదా సంబంధిత విద్యార్హతను నిరూపించే మార్కుల మెమో వంటి ధ్రువపత్రాలను సమర్పించాలని సూచించారు. ఆన్లైన్తో పాటు సంబంధిత ఎన్నికల అధికారుల వద్ద కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. అర్హత కలిగిన పట్టభద్రులు చివరి తేదీ కోసం వేచి చూడకుండా నవంబర్ 6వ తేదీలోగా తమ దరఖాస్తులను సమర్పించాలని సర్పంచ్ కేతపాగ జయమ్మ,లక్ష్మయ్య విజ్ఞప్తి చేశారు. విద్యావంతులు ఓటరు నమోదుపై అవగాహన కలిగి ఉండటంతో పాటు తమకు తెలిసిన ఇతర పట్టభద్రులకు కూడా ఈ విషయాన్ని తెలియజేసి ఓటరు నమోదుకు ప్రోత్సహించాలని కోరారు



టీజీటెట్ రాసే ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు గుడ్‌న్యూస్!

- నవంబర్ 5 నుంచి 10 వరకు సీబీటీ మాక్ టెస్ట్ ప్రాక్టీస్.. జిల్లాలో ఐదు పరీక్షా కేంద్రాల ఏర్పాటు

- ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి: డీఈఓ ఐ. విజయకుమారి

మహబూబ్‌నగర్ (ప్రజా జ్యోతి బ్యూరో):

టీజీటెట్ ఇన్‌సర్వీస్ టీచర్స్--2026-xx పరీక్షకు దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులకు కంప్యూటర్ ఆధారిత పరీక్షా విధానంపై అవగాహన కల్పించేందుకు జిల్లా విద్యాశాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. నవంబర్ 5 నుంచి 10వ తేదీ వరకు జిల్లాలోని ఐదు కేంద్రాల్లో సీబీటీ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) మాక్ టెస్ట్ నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఐ. విజయకుమారి వెల్లడించారు. పరీక్షకు హాజరయ్యే ఉపాధ్యాయులు కంప్యూటర్ ఆధారిత పరీక్షా విధానాన్ని ముందుగానే తెలుసుకోవడంతో పాటు, కంప్యూటర్ వినియోగంలో ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ఈ మాక్ టెస్ట్ మంచి అవకాశమని ఆమె పేర్కొన్నారు.

జిల్లాలో ఐదు కేంద్రాల ఏర్పాటు

మాక్ టెస్ట్ ప్రాక్టీస్ కోసం మహబూబ్‌నగర్ జిల్లాలో ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

1. జెడ్పీహెచ్ఎస్, భూత్పూర్.
2. జెడ్పీహెచ్ఎస్, జడ్చర్ల.
3. జెడ్పీహెచ్ఎస్ (గర్ల్స్), దేవరకద్ర.
4. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, షాషాబ్ గుట్ట.
5. కేజీబీవీ, మహబూబ్‌నగర్ అర్బన్.

ఈ ఐదు కేంద్రాల్లో ఉపాధ్యాయులు తమకు అనుకూలమైన ఏదైనా ఒక కేంద్రాన్ని సందర్శించి మాక్ టెస్ట్ ప్రాక్టీస్ చేసుకోవచ్చని విద్యాశాఖ తెలిపింది.

ఆన్‌లైన్‌లో మాక్ టెస్ట్ అందుబాటులోకి..

మాక్ టెస్ట్ తెలంగాణ పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్ ప్ట్రజూం://ంఎష్ట్రశీశీశ్రీవఎబ్. వశ్రీఖఅస్ట్రుఱుఖ. స్ట్రశీజ.అఅ లో అందుబాటులో ఉంటుందని అధికారులు వెల్లడించారు. కేంద్రాల్లో కల్పించిన కంప్యూటర్, ఇంటర్నెట్ సౌకర్యాలను వినియోగించుకుని పరీక్షా విధానంపై పూర్తి అవగాహన పొందవచ్చని సూచించారు.

ఓడీ సౌకర్యం లేదు.. గమనించాలి!

మాక్ టెస్ట్‌కు హాజరయ్యే ఉపాధ్యాయులకు ఎలాంటి అధికారిక విధి (ఋణ) సౌకర్యం కల్పించబడదని జిల్లా విద్యాశాఖ స్పష్టం చేసింది. ఉపాధ్యాయులు తమ వ్యక్తిగత సౌలభ్యం మేరకు మాక్ టెస్ట్‌కు హాజరుకావాలని సూచించింది.టీజీటెట్ అసలు పరీక్షకు ముందుగానే కంప్యూటర్ ఆధారిత పరీక్షా విధానంపై అనుభవం సంపాదించుకునేందుకు లభించిన ఈ అవకాశాన్ని అర్హులైన ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులందరూ సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ ఐ. విజయకుమారి కోరారు.

పాతర్ చెడు పత్తి మిల్లు కానుగోలు

తూకాల్లో మోసాలు

రైతుల తరపున మిల్లును ముట్టడించిన బీఆర్ఎస్ నాయకులు

కింటాకు 5 కేజీల తరుగుపై మిల్లు యజమానులను నిలదీత









నర్వ నవంబర్ 3 ప్రజాజ్యోతి

ఆరుగాలం కష్టపడి పండించిన పత్తినీ మార్కెట్ కు తరలించి విక్రయించాలనీ ఎంతో ఆశతో సమీపములోని కాటన్ మిల్లు వద్దకు తీసుకువెళ్లగా అక్కడ తూకాల్లో మోసాలు చేసి రైతులను దగా చేస్తున్న వైనం పై బిఆర్ఎస్ మండల పార్టీ నాయకులు స్పందించి వెంటనే రైతుల పక్షాన వెళ్లి ఆ మిల్లును ముట్టడించి సంబంధిత మిల్లు యజమానులను నిలదీసి నా సంఘటన నారాయణపేట జిల్లా నర్వ మండలం పాతర్చేడు గ్రామ శివారులో నూతనంగా ఏర్పాటు చేసిననూతనంగా మిల్లు ధర్మకాం టా లో చోటు చేసుకున్నది, ఈ విషయము తెలుసుకున్న మండల టిఆర్ఎస్ పార్టీ నాయకులు మంగళవారం రైతుల పక్షాన మిల్లును ముట్టడించి అక్కడ జరుగుతున్న పత్తి కొనుగోలు అవకతవకలపై రైతుల ద్వారా తెలుసుకొని సంబంధిత మిల్లు యజమాని సిబ్బందులను మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి, సింగల్ విండో చైర్మన్ శ్రీనివాస రెడ్డిలు రైతుల పక్షాన మాట్లాడుతూ ప్రశ్నించారు, ఈ ప్రాంత రైతులకు సమీపంలో పత్తి మిల్లు నిర్మాణం కావడంపై ఆనందకరంగా భావించిన రైతులకు పత్తి మిల్లు ప్రారంభ దశలోనే ఇలా తూకాలో మోసాలు జరుగుతే రైతులు ఎలా నమ్మాలి అని ప్రశ్నించారు, క్వింటాలు పత్తికి ఇక్కడ 7, 200 నుండి500 వరకు ఉంటే రాంపూర్ గేటు వద్ద 9 వేలు,200 వరకు ఎందుకు ఉంటుందని ప్రశ్నించారు రాంపూర్ గేటు వద్ద పత్తి మిల్లులో ఒక రేటు పాత చెడు పత్తి మిల్లులో ఒక రేటు ఉంటే రైతులు ఎలా నమ్మాలి అని ప్రశ్నించారు, ఇదిలా ఉండగా అసలు ఎన్ ఎస్ పి ధర కింటాలకు 8,620 రూపాయలు ఉంటుందన్నారు, అంతకన్నా తక్కువ రేటుకు ఎందుకు కొనుగోలు చేస్తున్నారని ప్రశ్నించారు, ఏది ఏమైనా అప్పటికీ రైతుల ఉపయోగాహర్తం ఇలాంటి మిల్లులు ఏర్పాటుచేసిన ఒక సంస్థలు యజమానులు ఇంత దారుణంగా దోపిడి చేయకుండా రైతులకు నమ్మదగే విధంగా ఉండాలని ఆయన ఆరోపించారు, అనంతరం వే బ్రిడ్జి కాంటా వద్దకు వెళ్లి చూడగా అక్కడ 30, 20, 35 25 క్వాంటిటీ డిస్ప్లే మీద నెంబర్లు పడతాయి గాని ఒకటి రెండు మూడు రావకపోవడంతో రైతులకు తీవ్ర అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి, తూకాల్లో ఏదైనా సాంకేతిక లోపాలు ఉంటే సరి చేసుకోవాలని సూచించారు, ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల నాయకులు దండు అయ్యప్ప, శ్రీకాంత్ రెడ్డి, కాల్వాల వడ్డే ఆంజనేయులు, డాక్టర్ శంకర్, కేశవులు, నరసింహ, శివ ,ఎండి కాజా మైనుద్దీన్, కావాలి కృష్ణయ్య, ఆయా గ్రామాల రైతులు, టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా వైద్యం.. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం!

- రంగారెడ్డిగూడలో రెండు ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలకు డీఎంహెచ్ఓ తాళం

మహబూబ్‌నగర్, నవంబర్ 3 (ప్రజా జ్యోతి బ్యూరో):

ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న అనధికార ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా







మంగళవారం రంగారెడ్డిగూడలో నిర్వహిస్తున్న రెండు ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏ. శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేసి మూసివేశారు. తనిఖీల సందర్భంగా ఆయా కేంద్రాల్లో అనుమతులు లేకుండా మందుల నిల్వలు ఉంచడంతో పాటు, అధిక శక్తి కలిగిన యాంటీబయాటిక్స్, ఫ్లూయిడ్స్ వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అంతేకాకుండా వినియోగించిన సిరంజీలు, సెలైన్ బాటిళ్లను రోజుల తరబడి అక్కడే నిల్వ ఉంచినట్లు పరిశీలనలో వెల్లడైంది. వైద్య వ్యర్థాలను నిబంధనల ప్రకారం శాస్త్రీయ పద్ధతిలో సురక్షితంగా పారవేయాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా వ్యవహరించడం ప్రజారోగ్యానికి ముప్పుగా మారుతుందని అధికారులు పేర్కొన్నారు. ముఖ్యంగా వినియోగించిన సిరంజీలు, వైద్య వ్యర్థాలను నిర్లక్ష్యంగా నిల్వ ఉంచడం వల్ల ఇన్ఫెక్షన్లు వ్యాపించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ ఉల్లంఘనలను పరిగణనలోకి తీసుకున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రెండు ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలను మూసివేయాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో డాక్టర్ శివకాంత్ (నోడల్ అధికారి), హనుమంతు (హెల్త్ ఎడ్యుకేటర్), సిద్ధిక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ!

- పారిశుద్ధ్యం, ఆహార నాణ్యత, వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఆదేశం





మహబూబ్‌నగర్, నవంబర్ 3 (ప్రజా జ్యోతి బ్యూరో):

జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు పారిశుద్ధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు.మంగళవారం మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సందర్శించిన అదనపు కలెక్టర్ ఆసుపత్రిలోని వివిధ విభాగాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆసుపత్రి ప్రాంగణంలోని పారిశుద్ధ్య పరిస్థితులు, పరిసరాల పరిశుభ్రత, కిచెన్ నిర్వహణను తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, పరిశుభ్రత, పోషక విలువలపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆసుపత్రిలో రోగులకు కల్పిస్తున్న వైద్య సదుపాయాలు, మౌలిక వసతులపై ఆరా తీశారు. చిన్నపిల్లల ఎన్‌ఐసీయూ కేంద్రాన్ని సందర్శించి నవజాత శిశువులకు అందిస్తున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న పరికరాలు, చికిత్సా సదుపాయాలను పరిశీలించారు. అలాగే ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహిస్తున్న సదరం శిబిరాన్ని సందర్శించి దివ్యాంగులకు చేపడుతున్న వైద్య పరీక్షలు, అంగవైకల్య నిర్ధారణ ప్రక్రియ, శిబిరంలో కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. అర్హులైన దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వైద్య పరీక్షలు నిర్వహించి, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సేవలు అందించాలని అధికారులకు సూచించారు.

రోగులకు నాణ్యమైన ఆహారం, మెరుగైన వైద్యం అందాలి

ఆసుపత్రిలో పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, రోగులకు అందించే ఆహారంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. వైద్య సేవల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగా అజ్మీరా తదితరులు పాల్గొన్నారు.

అబ్రహం స్కూల్‌పై తల్లిదండ్రుల ఆరోపణలు

- ఫీజులన్నీ చెల్లించినా పదో తరగతి లాంగ్ మెమో ఇవ్వడం లేదని ఆవేదన

గద్వాల నవంబర్ 03(ప్రజా జ్యోతి ప్రతినిధి):

గద్వాల పట్టణంలోని అబ్రహం స్కూల్ యాజమాన్యం పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థినికి లాంగ్ మెమో (టీసీతో కూడిన స్టడీ సర్టిఫికెట్) ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని విద్యార్థిని తల్లిదండ్రులు ఆరో పిస్తున్నారు.తమ కుమార్తెకు సంబంధించిన పాఠశాల ఫీజులన్నీ పూర్తిగా చెల్లించినప్పటికీ,ఇప్పటివరకు లాంగ్ మెమో అందజేయలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మెమో ఇవ్వకపోవడంతో విద్యార్థిని తదుపరి విద్యాభ్యాసానికి ఆటంకం కలుగుతోందని,ఆమె భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నామని తెలిపారు.

కలెక్టర్,విద్యాశాఖ అధికారులు స్పందించాలి

ఈ సమస్యపై పాఠశాల యాజమాన్యం వెంటనే స్పందించి విద్యార్థినికి లాంగ్ మెమో అందజేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.జిల్లా కలెక్టర్,జిల్లా విద్యాశాఖ అధికారులు ఈ వ్యవహారంపై విచారణ జరిపి వాస్తవాలను తెలుసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.విద్యార్థిని భవిష్యత్తుకు ఎలాంటి ఆటంకం కలగకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరుతున్నారు.



విద్యార్థుల విద్యా ప్రగతిపై పేరెంట్స్--టీచర్స్ సమీక్ష!

- 6 సమ్మేటివ్ అసెస్‌మెంట్--x ఫలితాల విశ్లేషణ.. తల్లిదండ్రులకు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డుల పంపిణీ

- 6 ప్రభుత్వ పాఠశాలల్లో పీటీఎం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సమావేశాలకు విద్యాశాఖ ఆదేశాలు

మహబూబ్‌నగర్, నవంబర్ 5 (ప్రజా జ్యోతి బ్యూరో):

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచడంతో పాటు, వారి విద్యా ప్రగతిపై తల్లిదండ్రులకు పూర్తి అవగాహన కల్పించే లక్ష్యంతో గురువారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో పేరెంట్స్--టీచర్స్ మీటింగ్ (పీటీఎం), అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ (ఏఏపీసీ) సమావేశాలు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ ఆదేశించింది. తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ఇ. నవీన్ నికోలస్, ఐఏఎస్ జారీ చేసిన ప్రొసీడింగ్స్ ప్రకారం ఈ సమావేశాలు నిర్వహించనున్నారు.

పరీక్షల ఫలితాలపై సమగ్ర సమీక్ష

2026 అక్టోబర్ 1 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించిన సమ్మేటివ్ అసెస్‌మెంట్--x పరీక్షల ఫలితాలను తరగతులు, సబ్జెక్టులు, విద్యార్థుల వారీగా విశ్లేషించి వారి అభ్యసన స్థాయిని అంచనా వేయనున్నారు. విద్యార్థులు ఏయే అంశాల్లో ప్రతిభ కనబరిచారు? ఏయే సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారు? ఎలాంటి అంశాల్లో ప్రత్యేక శిక్షణ అవసరం? అనే విషయాలను గుర్తించి తదనుగుణంగా బోధనా ప్రణాళికలు రూపొందించనున్నారు.

తల్లిదండ్రులకు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు

సమావేశాల్లో భాగంగా విద్యార్థులందరి హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను తల్లిదండ్రులకు అందజేసి, వారి విద్యా ప్రగతి, అభ్యసన సామర్థ్యాలు, ఇతర అంశాల్లో సాధించిన పురోగతిని ఉపాధ్యాయులు వివరించనున్నారు. ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని తల్లిదండ్రులు అర్థం చేసుకునేలా సమగ్రంగా అవగాహన కల్పించనున్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

విద్యార్థుల్లో గుర్తించిన అభ్యసన లోపాలను తల్లిదండ్రులకు తెలియజేయడంతో పాటు, వాటిని అధిగమించేందుకు పాఠశాలల్లో చేపట్టే ప్రత్యేక బోధనా కార్యక్రమాలను వివరించనున్నారు. అవసరమైన విద్యార్థులకు రెమిడియల్ టీచింగ్, ప్రత్యేక శిక్షణ, ఎన్‌రిచ్‌మెంట్ కార్యక్రమాలు అమలు చేయనున్నారు. పిల్లల హాజరు, క్రమశిక్షణ, చదువుపై ఆసక్తి పెంపొందించడంలో తల్లిదండ్రుల భాగస్వామ్యం కీలకమని ఉపాధ్యాయులు సూచించనున్నారు.

పాఠశాల అభివృద్ధిలో అమ్మ ఆదర్శ కమిటీల భాగస్వామ్యం

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సమావేశాల్లో పాఠశాల అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపుదల, పాఠశాల కార్యకలాపాల్లో తల్లిదండ్రుల భాగస్వామ్యం వంటి అంశాలపై చర్చించనున్నారు. పాఠశాలల అభివృద్ధికి కమిటీ సభ్యులు సమన్వయంతో సహకరించాలని విద్యాశాఖ సూచించింది.విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలంటే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాఠశాల కమిటీ సభ్యుల మధ్య సమన్వయం అవసరమని జిల్లా విద్యాశాఖ పేర్కొంది. ప్రతి విద్యార్థి అభ్యసన స్థాయిని మెరుగుపరచడం, ఎవరూ చదువులో వెనుకబడకుండా చూడడం, నాణ్యమైన విద్య అందించడం లక్ష్యంగా ఈ సమావేశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరింది.'ప్రతి విద్యార్థి ప్రగతి -- ప్రతి పాఠశాల అభివృద్ధి -- నాణ్యమైన విద్య మనందరి బాధ్యత' అనే నినాదంతో జిల్లా విద్యాశాఖ ఈ కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తోంది.

మోడల్ స్కూల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- 12 డిమాండ్లతో అధికారులకు వినతిపత్రాలు

గండీడ్:

తెలంగాణ మోడల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మోడల్ స్కూల్స్ సంయుక్త కార్యాచరణ కమిటీ (మీ–జోజ) డిమాండ్ చేసింది. మంగళవారం వెన్నచేడ్ మోడల్ స్కూల్ సిబ్బంది తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవోలకు 12 డిమాండ్లతో వినతిపత్రాలు అందజేశారు. పాఠశాలలను విద్యాశాఖలో విలీనం చేసి 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని, పెండింగ్ పదోన్నతులు కల్పించాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, ఆరోగ్య బీమా, కారుణ్య నియామకాలు అమలు చేయాలని కోరారు. గంటల ప్రాతిపదికన పనిచేసే ఉపాధ్యాయులకు రూ.35 వేల వేతనం, కంప్యూటర్ ఆపరేటర్లకు తగ్గించిన వేతనాల పునరుద్ధరణతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.



ఎండిపోయిన పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి అనూష







వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్.

మండల పరిధిలోని సంగినేనిపల్లి గ్రామంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు ఎండిపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి రాక అప్పులపాలయ్యామని కన్నీటిపర్యంతమవుతున్నారు. ఎండిపోయిన పంటలకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.సంగినేనిపల్లి గ్రామానికి చెందిన రైతు ఉడుత మౌలాలి సుమారు 12 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని 9 ఎకరాల్లో వేరుశనగ, మరో 3 ఎకరాల్లో మినుము పంట సాగు చేశారు. అయితే వర్షాలు లేకపోవడంతో మొత్తం పంట ఎండిపోయిందని, కనీసం అర ఎకరం పంట కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.పంట సాగు కోసం దాదాపు రూ.3 లక్షలు పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. చివరకు నీటి ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించి గుంతలు ఏర్పాటు చేసుకొని పంటకు తడులు పెట్టినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని వాపోయారు.అదే గ్రామానికి చెందిన రైతు జగన్మోహన్ రెడ్డి సాగు చేసిన సుమారు నాలుగు ఎకరాల వరి పంట కూడా ఎండిపోయిందని తెలిపారు.వర్షాభావ పరిస్థితులతో తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు నష్టపరిహారం అందించి తమను ఆదుకోవాలని సంగినేనిపల్లి రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గ్రామంలో దాదాపు 180 ఎకరాల్లో పంటలు ఎండిపోయినట్లు బీఆర్ఎస్ నాయకుడు వేణుమాధవ్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు వేణుమాధవ్ రెడ్డి, రైతులు మౌలాలి, జగన్మోహన్ రెడ్డి, పాము రెడ్డి, యుగంధర్, ఏఈఓ అనూష తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న 15 మొబైల్ ఫోన్లు

- సి.ఇ.ఐ.ఆర్ పోర్టల్‌తో ఫోన్ల ఆచూకీ..

- బాధితులకు మహబూబ్‌నగర్ వన్‌టౌన్ పోలీసుల ఊరట

- సాంకేతిక పరిజ్ఞానంతో మొబైల్ ఫోన్లను గుర్తించి స్వాధీనం

- బాధితులకు తిరిగి అందజేసిన ఇన్‌స్పెక్టర్ అప్పయ్య

మహబూబ్‌నగర్, నవంబర్ 3 (ప్రజా జ్యోతి బ్యూరో):

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు తిరిగి దొరకవనే ఆందోళనలో ఉన్న బాధితులకు మహబూబ్‌నగర్ వన్‌టౌన్ పోలీసులు ఊరటనిచ్చారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన సి.ఇ.ఐ.ఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్‌ను వినియోగించి సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో గుర్తించిన 15 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని, వాటి అసలు యజమానులకు తిరిగి అందజేశారు.జిల్లా ఎస్పీ దరావత్ జానకి ఆదేశాల మేరకు మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితుల ఫిర్యాదులపై వన్‌టౌన్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో వివిధ సందర్భాల్లో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల వివరాలను సి.ఇ.ఐ.ఆర్ పోర్టల్ ద్వారా పరిశీలించి, వాటి ఐ ఏం ఈ ఐ నంబర్ల ఆధారంగా 15 ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బాధితులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పయ్య చేతుల మీదుగా మొబైల్ ఫోన్లను అందజేశారు.

ఫోన్లు తిరిగి రావడంతో బాధితుల ఆనందం

తమ విలువైన మొబైల్ ఫోన్లు తిరిగి లభించడంతో బాధితులు



సంతోషం వ్యక్తం చేశారు. జిల్లా ఎస్పీ డి. జానకితో పాటు వన్‌టౌన్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

సి.ఇ.ఐ.ఆర్ పోర్టల్‌తో పోయిన ఫోన్లకు గుర్తింపు

ప్రతి మొబైల్ ఫోన్‌కు ప్రత్యేకంగా ఉండే ఐఎం ఈ ఐ నంబర్ ఆధారంగా సి.ఇ.ఐ.ఆర్ పోర్టల్ పనిచేస్తుంది. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నా లేదా దొంగిలించబడినా బాధితులు ఈ పోర్టల్‌లో ఫోన్ వివరాలు, ఐ ఎం ఈ ఐ నంబర్, అవసరమైన పత్రాలతో ఫిర్యాదు నమోదు చేయవచ్చు. తద్వారా ఫోన్ వినియోగాన్ని బ్లాక్ చేయడంతో పాటు, పోలీసుల సాంకేతిక చర్యల ద్వారా దాని ఆచూకీ గుర్తించే అవకాశం ఉంటుంది.మొబైల్ ఫోన్ వినియోగదారులు తమ ఫోన్ ఐ ఎం ఈ ఐ నంబర్‌ను భద్రపరచుకోవాలని, ఫోన్ పోగొట్టుకున్న వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారు. సి.ఇ.ఐ.ఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను బ్లాక్ చేయించుకోవాలని, గుర్తుతెలియని వ్యక్తులకు ఓ టీ పి లు, బ్యాంకింగ్ వివరాలు వెల్లడించవద్దని హెచ్చరించారు. సెకండ్‌హ్యాండ్ మొబైల్ ఫోన్లు కొనుగోలు చేసేటప్పుడు వాటి యాజమాన్య వివరాలు పరిశీలించి, తప్పనిసరిగా కొనుగోలు బిల్లు తీసుకోవాలని సూచించారు. ప్రజల భద్రతే లక్ష్యంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ బాధితులకు సేవలందించేందుకు జిల్లా పోలీసు శాఖ కృషి చేస్తోందని ఎస్పీ దరావత్ జానకి తెలిపారు.ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పయ్య, ఎస్ఐ వసంత, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కురుమూర్తి జాతరకు పోలీసుల పటిష్ట భద్రతా వలయం.!

- ఉద్దాల ఉత్సవానికి భారీగా భక్తుల రాక.. బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణపై ఎస్పీ జానకి ప్రత్యేక దృష్టి

- నవంబర్ 10 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- నవంబర్ 16న ఉద్దాల ఉత్సవం.. ముందస్తు ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష





మహబూబ్‌నగర్, నవంబర్ 3 (ప్రజా జ్యోతి బ్యూరో):

దక్షిణ తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా పేరొందిన శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలకు సమయం ఆసన్నమవుతోంది. నవంబర్ 10 నుంచి ప్రారంభం కానున్న జాతరకు వేలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో జిల్లా పోలీస్ శాఖ అప్రమత్తమైంది. ముఖ్యంగా నవంబర్ 16న నిర్వహించనున్న అత్యంత కీలకమైన ఉద్దాల ఉత్సవానికి భారీగా భక్తులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో భద్రత, ట్రాఫిక్ నియంత్రణకు పటిష్టమైన ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా ఎస్పీ దరావత్ జానకి, అధికారులను ఆదేశించారు. జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు జిల్లా ఎస్పీ స్వయంగా కురుమూర్తి దేవాలయాన్ని సందర్శించి జాతర ప్రాంగణం, పరిసర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం సంబంధిత పోలీసు అధికారులతో బందోబస్తు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు.

రద్దీ నియంత్రణకు ప్రత్యేక వ్యూహం!

జాతర సమయంలో భక్తుల రద్దీకి అనుగుణంగా పోలీసు బలగాలను మోహరించాలని, వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాలను గుర్తించడం, అవసరమైన చోట్ల ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టడం, బారికేడ్లు ఏర్పాటు చేయడం, సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఉంచడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

ఉద్దాల ఉత్సవంపై ప్రత్యేక నిఘా!

నవంబర్ 16న నిర్వహించనున్న ఉద్దాల ఉత్సవం సందర్భంగా భక్తుల రద్దీ అత్యధికంగా ఉండే అవకాశం ఉందని పోలీసులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉత్సవ ప్రాంతంలో అదనపు పోలీసు బలగాలను మోహరించడం, భక్తుల రాకపోకలకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేయడం, రద్దీని క్రమబద్ధీకరించడం, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని ఎస్పీ అధికారులకు స్పష్టం చేశారు.

భక్తుల భద్రతే పోలీసుల ప్రథమ ప్రాధాన్యత

కురుమూర్తి స్వామి దర్శనానికి వచ్చే ప్రతి భక్తుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వామివారిని దర్శించుకుని క్షేమంగా తిరిగి వెళ్లేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ సూచించారు. భక్తుల భద్రత, సౌకర్యాల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

కరువు కారణంగా ఎండిపోయిన పంటల వివరాలను వ్యవసాయ కార్యాలయానికి వివరాలు ఇవ్వండి

- రైతులకు చిన్నంబావి వ్యవసాయ శాఖ విజ్ఞప్తి

చిన్నంబావి, నవంబర్ 03 (ప్రజా జ్యోతి)

చిన్నంబావి మండల పరిధిలో నీటి ఎద్దడి, కరువు పరిస్థితుల కారణంగా సాగు చేసిన పంటలు ఎండిపోయిన రైతులు తమ పంట నష్ట వివరాలను వెంటనే సంబంధిత గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారులకు ఏఈఓ తెలియజేయాలని మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్ కోరారు. పంట నష్టం వివరాల సేకరణకు రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

వివరాలు తప్పనిసరిగా అందించాలి

పంటలు ఎండిపోయిన రైతులు తమ పేరు, గ్రామం, సాగు చేసిన పంట పేరు, మొత్తం సాగు విస్తీర్ణం, ఎండిపోయిన పంట విస్తీర్ణం, మొబైల్ నంబర్‌తో పాటు పంట నష్టానికి సంబంధించిన ఫొటోలను సమర్పించాలి. గ్రామ ప్రజాప్రతినిధులు, రైతు సోదరులు ఈ సమాచారాన్ని సంబంధిత ఏఈఓలకు అందించి పంట నష్ట వివరాల సేకరణలో భాగస్వాములు కావాలని అధికారులు సూచించారు.

క్షేత్రస్థాయిలో పరిశీలన

రైతుల నుంచి అందిన వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనల ప్రకారం తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి తెలిపారు.



విద్యాశాఖ కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం వద్దు!

- ఉపాధ్యాయుల రిపోర్టింగ్‌లో జాప్యం చేయొద్దు.. యూనిఫారాల పంపిణీ వంద శాతం పూర్తి చేయాలి

- నవంబర్ 5న మెగా పేరెంట్--టీచర్ సమావేశాలు..

విద్యాశాఖ అధికారులకు అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్ ఆదేశాలు

మహబూబ్‌నగర్, నవంబర్ 3 (ప్రజా జ్యోతి బ్యూరో):

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల విద్యా ప్రమాణాల మెరుగుదలతో పాటు విద్యాశాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మహబూబ్‌నగర్ ఐడీఓసీ సమావేశ మందిరంలో మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇతర విద్యాశాఖ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో పాఠశాలల విద్యా పురోగతి, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల కొరత, ప్రభుత్వ విద్యా కార్యక్రమాల అమలుపై సమగ్రంగా సమీక్షించారు.

ఉపాధ్యాయుల కొరతకు పరిష్కారం చూపాలి

పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు చేపట్టిన వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియలో భాగంగా ఇతర పాఠశాలలకు కేటాయించిన ఉపాధ్యాయులు వెంటనే విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఉపాధ్యాయుల రిపోర్టింగ్‌లో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు.

యూనిఫారాల పంపిణీకి గడువు

విద్యార్థులకు పాఠశాల యూనిఫారాల పంపిణీని దీపావళి నాటికి అన్ని పాఠశాలల్లో వంద శాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నవంబర్ 5వ తేదీన అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్--టీచర్ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు.

నవంబర్ నెలంతా వంద శాతం హాజరు లక్ష్యం

ప్రభుత్వం నవంబర్ నెలను వంద శాతం విద్యార్థుల హాజరు



మాసంగా ప్రకటించిన నేపథ్యంలో ప్రతి విద్యార్థి పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వంద శాతం హాజరు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాలన్నారు.

ఎల్‌నినోపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎల్‌నినో పరిస్థితులు, వాటి ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. మెగా పేరెంట్--టీచర్ సమావేశాల్లో తల్లిదండ్రులకు సైతం ఈ అంశంపై వివరించాలని సూచించారు.అదేవిధంగా ప్రశస్త్ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులకు ప్రత్యేక అవగాహన కల్పించాలని, ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు 30 నిమిషాల అవగాహన వీడియోను తప్పనిసరిగా వీక్షించాలని ఆదేశించారు.

పెండింగ్ పనులు గడువులోగా పూర్తి చేయాలి

సమావేశంలో సమగ్ర శిక్ష, పీఎం శ్రీ నిధుల వినియోగం, స్కూట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు బూట్లు, యూనిఫారాల కొలతలు, పునాది అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం, ఎస్ఏ-1 పరీక్షల మార్కుల నమోదు, విద్యార్థుల ఆధార్ నమోదు, తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్, డ్రాప్



బాక్స్, అపార్ ఐడీల జారీ తదితర అంశాలపై సమీక్షించారు.అలాగే జీపీ, ఈపీ, ఎఫ్‌పీ స్థితిగతులు, పాఠశాల స్థాయిలో జీసీఈఏసీ కార్యకలాపాలు, స్వీయ రక్షణ కార్యక్రమాల అమలుపై చర్చించారు. ఆయా కార్యక్రమాల అమలులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, పెండింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, ఏఎంఓ డి. శ్రీనివాస్, సీఎంఓ సుధాకర్ రెడ్డి, మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎస్‌వోలు, ప్రిన్సిపాళ్లు, మిస్కోలు, సీసీవోలు, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కు విద్యా బుద్ధులు.....గ్రామానికి మౌలిక వసతులు.

గాదిరాల్ లో సేవా రత్న అవార్డు గ్రహీత డా.వెన్న ఈశ్వరప్ప

మహమ్మాదాబాద్ నవంబర్

3(ప్రజా జ్యోతి)

మహమ్మదాబాద్ మండలంలోని గాదిరాల్ గ్రామంలో బిజెపి రాష్ట్ర నాయకుడు డాక్టర్ వెన్న ఈశ్వరప్ప పర్యటన కేవలం ఒక సాధారణ పుస్తకాల పంపిణీ కార్యక్రమం మాత్రమే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోని మౌలిక వసతులు సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించిన కార్యక్రమం గా నిలిచింది. విద్యార్థులు స్వామి వివేకానంద జీవిత చరిత్రను ఆదర్శం గా తీసుకోవాలని ఉపాధ్యాయుల మరియు తల్లిదండ్రుల చెప్పే మాటలను పాటించి సమాజం లో ఉన్నత స్థాయి కి చేరుకోవాలని డా. వెన్న ఈశ్వరప్ప సూచించారు.పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న



తాగు నీటి సమస్య ను ప్రధానోపాధ్యాయుడు రాములు,సర్పంచ్ మాణిక్యమ్మ ఆయన దృష్టి కి తీసుకురావడం తో వెంటనే స్పందించి ఆర్ ఓ ప్లాంట్ ఏర్పాటు చేస్తానని హామీ ఇవ్వడం తో విద్యార్థులు ఉపాధ్యాయులు,కృతజ్ఞతలు తెలియ జేశారు.మండలంలో ఉన్న అనేక



సమస్యల్ని ఎంపీ దృష్టికి తీసుకెళ్లి ఎం పి నిధుల ద్వారా రోడ్లు, కమ్యూనిటీ హాల్,మొదలైనవి నిర్మించి మండల ప్రజలకు సేవ చేయడం లో ముందుంటానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ మాణిక్యమ్మ, బిజెపి మండల అధ్యక్షుడు మూస నర్సింహా,జిల్లా కౌన్సిల్ నెంబర్ కురువ కృష్ణ,బీజేపీఎం గండేడ్ మండల అధ్యక్షుడు చిట్యాల యాదగిరి బిజెపి నాయకులు ప్రభు నాయక్,ముచ్చర్ల సురేష్ భద్రీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
బుధవారం 04 నవంబర్ 2026

చెల్లెపాడు లిఫ్ట్ ను సందర్శించిన... కురువ చిన్న మల్లయ్య

- కాపర్ వైర్ దొంగలను కఠినంగా శిక్షించాలి

- పాలకుల నిర్లక్ష్యంపై ఎస్సీ సంక్షేమ రాష్ట్ర అధ్యక్షుడి ఆగ్రహం









చిన్నంబావి, నవంబర్ 03 (ప్రజాజ్యోతి)

రైతులకు సాగునీరు అందించాల్సిన చెల్లెపాడు ఎత్తిపోతల పథకం నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారిందని మాదాసి/మాదారి కురువ ఎస్సీ సంక్షేమ రాష్ట్ర అధ్యక్షుడు కురువ చిన్న మల్లయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నంబావి మండలంలోని చెల్లెపాడు ఎత్తిపోతల పథకాన్ని ఆయన సందర్శించి పంప్‌హౌస్, మోటార్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల పరిస్థితిని పరిశీలించారు. ఆదివారం జరిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్ చోరీ ఘటనపై స్పందిస్తూ దొంగలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నాలుగు కాలూరు చెల్లపాడు అయ్యవారిపల్లి వెంకటంపల్లి గ్రామాలకు చెందిన సుమారు 750 ఎకరాలకు సాగునీరు అందించే ఈ పథకాన్ని పాలకులు అధికారులు పట్టించుకోకపోవడందారుణమన్నారు.రూ. 47 లక్షలతో శంకుస్థాపన.. ముందుకు సాగని పనులు చెల్లెపాడు లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి రూ. 47 లక్షలతో శంకుస్థాపన చేసినప్పటికీ పనులు ముందుకు సాగలేదని చిన్న మల్లయ్య పేర్కొన్నారు. పంప్‌హౌస్, మోటార్లు నిరుపయోగంగా మారడంతో పాటు పరికరాలు చోరీకి గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు సాగునీరు అందించాల్సిన పథకాలు నిర్వహణ లోపంతో మూలనపడటం బాధాకరమన్నారు.

నెదర్లాండ్ ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు

చిన్నమారు, చెల్లెపాడు ఎత్తిపోతల పథకాలను స్వర్గీయ రామచంద్రరావు నెదర్లాండ్ ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞాన సహకారంతో ఏర్పాటు చేయించారని కురువ చిన్న మల్లయ్య గుర్తుచేశారు. నాలుగు గ్రామాల రైతులకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో నిర్మించిన ఈ పథకాలు ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురవుతున్నాయని తెలిపారు. వరుసగా చోరీలు జరుగుతున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడం రైతులకు శాపంగా మారిందన్నారు.రైతుల అప్రమత్తతతో దొంగల పట్టివేత చెల్లెపాడు రైతులు పంట పొలాలకు వెళ్తున్న సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద అనుమానాస్పద శబ్దాలు వినిపించడంతో అప్రమత్తమై చోరీకి పాల్పడుతున్న వ్యక్తులను వెంబడించి పట్టుకున్నట్లు సమాచారం అందిందన్నారు. గతంలో చిన్నమారు ఎత్తిపోతల పథకం వద్ద కూడా కాపర్ వైర్ చోరీలు జరిగాయని, తాము ప్రశ్నించిన అనంతరం రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో రైతులకు సాగునీరు అందిందని గుర్తుచేశారు.మంత్రి సొంత మండలంలోనే రైతులకు సాగునీటి కష్టాలు మంత్రి సొంత మండలంలోనే ఎత్తిపోతల పథకాలకు రక్షణ లేకుండా చోరీలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని చిన్న మల్లయ్య విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని మండిపడ్డారు. చెల్లెపాడు ఎత్తిపోతల పథకానికి తక్షణమే మరమ్మతులు చేపట్టి, చిన్నమారు లిఫ్టును కూడా పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని మంత్రి, సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. నాలుగు గ్రామాల రైతులకు సాగునీరు అందించి వ్యవసాయాన్ని ఆదుకోవాలని కోరారు.